సాక్షి విశాఖపట్నం

శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



అప్పన్న రికార్డులు, ఆభరణాల పరిశీలన 8లో



సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు 8లో



కళాభారతిలో నృత్య వైభవం 8లో

న్యూస్‌రీల్

మార్గశిర మాసోత్సవాలకు సన్నద్ధం కావాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు సన్నద్ధం కావాలని, ఇప్పటి నుంచే సంబంధిత అభివృద్ధి పనులు ప్రారంభించి, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు కల్పించాలని, నాణ్యమైన అన్నప్రసాదం అందించాలని సూచించారు. శుక్రవారం ఆయన ఆకస్మికంగా ఆలయాన్ని తనిఖీ చేసి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ధర్మ దర్శనం క్యూలతోపాటు ఇతర క్యూల ఏర్పాట్లను చూశారు. అన్న ప్రసాదం భోజనశాలను సందర్శించి అక్కడ వినియోగించే సరకులను, రికార్డులను తనిఖీ చేశారు. ఆలయ పరిసరాల్లో ఉన్న అన్ని ద్వారాల వద్ద గేట్లు, క్యూల పరిస్థితి తెలుసుకున్నారు. సంబంధిత మ్యాప్‌లు పరిశీలించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు నెలాఖరు

ఆరిలోవ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) కోసం దరఖాస్తులను ప్రభుత్వ పరీక్షల కార్యాలయం వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో ఈ నెల 4 నుంచి అందుబాటులో ఉంచినట్లు డీఈవో ఎస్.ప్రేమ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 30 వరకు గడువుందన్నారు. దరఖాస్తు సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగా పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలు, వసతి సౌకర్యంలేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్నవారై, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్నవారే అర్హులన్నారు. దరఖాస్తు చేసేటప్పుడు ఆయా ధ్రువపత్రాలు అవసరం లేదని, పరీక్ష రాసే సమయానికి మాత్రం తప్పనిసరన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుంగా చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం విద్యాశాఖ వెబ్‌సైట్ నందు, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్‌కు షిప్ బిల్డింగ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న డిప్యూటీ జీఎం ఆనంద్‌మోహన్

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్‌ఎస్‌ఎల్) సంస్థ 'షిప్ బిల్డింగ్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకుంది. భారత నౌకాదళం కోసం డైవింగ్ సపోర్ట్ నౌకను నిర్మించడంలో వినూత్న పద్ధతులను అవలంబించినందుకు గానూ హెచ్‌ఎస్‌ఎల్‌కు ఈ అవార్డు లభించింది. ముంబయిలో జరిగిన మారిటైమ్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ తరఫున డిప్యూటీ జనరల్ మేనేజర్(ప్రొడక్షన్) ఆనంద్‌మోహన్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు మాట్లాడుతూ ఈ పురస్కారం తమకు గొప్ప ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. సంస్కరణలను విజయవంతంగా అమలు చేయడంలో, నౌకా నిర్మాణ ప్రాజెక్టులలో అద్భుతమైన పనితీరు కనబరచడంలో, షెడ్యూల్‌లో ఎదురైన క్లిష్టమైన సవాళ్లను అధిగమించి గొప్ప మైలురాళ్లను చేరుకోవడానికి ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా మిషన్‌కు అనుగుణంగా అత్యాధునిక నౌకా నిర్మాణ పరిష్కారాలను అందించడం ద్వారా సముద్ర రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి హెచ్‌ఎస్‌ఎల్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ(ఐఆర్‌సీఎస్) విశాఖపట్నం బ్రాంచి నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. 2025–2028 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, చైర్మన్‌గా సి.బాలసతీష్, ఉపాధ్యక్షుడిగా మురళీకృష్ణ పట్నాయక్, కార్యదర్శిగా పి.రవికుమార్, కోశాధికారిగా జి.వి.ప్రసాదరావు ఎన్నికయ్యారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా రహమతుల్లా, డాక్టర్ సిహెచ్ స్వామి నాయుడు, ఆచార్య నరవ ప్రకాశరావు, జ్యోతి స్వరూప్ నాయర్, ప్రొఫెసర్ హరనాథరావు, ఎం.అలతఫ్, ఎస్.బెనర్జీ, డాక్టర్ వాసవి లత తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సమావేశం గురువారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. పలు అంశాలపై చర్చించారు.

భావ ప్రకటనా స్వేచ్ఛకు కళ్లెం.. రాజ్యాంగ విరుద్ధం



ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పత్రికలు, టీవీలు వ్యవహరిస్తుంటాయి. పాత్రికేయులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రభుత్వాల దృష్టికి తీసుకువస్తుంటారు. తప్పులు సరిదిద్దుకోవాలి గానీ రాసిన పత్రికపై, పాత్రికేయులపై కక్ష కడితే ఎలా? ఇటీవల సాక్షిలో ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడిన ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే.. ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై, సంబంధిత జర్నలిస్టుపై అక్రమ కేసు పెట్టి వేధిస్తున్నారు. వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న సాక్షిపై కూటమి ప్రభుత్వం మొదటి నుంచి వేధించే ధోరణి అవలంబిస్తోంది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను.

– డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, మాజీ ఎంపీ, అనకాపల్లి



పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. ప్రెస్ మీట్‌లో నాయకుడు ఇచ్చిన వార్తను ప్రచురిస్తే కేసులు పెట్టడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం ఈ రాష్ట్రంలో లేదా? కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వాస్తవాలు వెలుగులోకి తెస్తున్న సాక్షిపై వేధింపులకు పాల్పడుతోంది. రాజకీయ పార్టీ నేత ప్రెస్ మీట్‌లో మాట్లాడిన మాటలను రిపోర్టర్ వార్తగా రాస్తే ఎడిటర్‌పై కేసులు పెడతారా? భావ ప్రకటన స్వేచ్ఛను అక్రమ కేసులు, నోటీసులతో నిరోధించలేరు. రాజకీయ కక్షతో సాక్షి ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం సరికాదు. రాష్ట్రంలోని ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం తప్పదు.

– డాక్టర్ గుమ్మా తనూజారాణి, ఎంపీ, అరకులోయ

ఎర్రమట్టి.. పరిమళించే..

యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్ తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలకు చోటు



సహజ వారసత్వ స్థలం జాబితాలో పొందుపరిచిన యునెస్కో

టెక్టానిక్ సిస్టమ్, కోస్టల్ సిస్టమ్ థీమ్‌లో ఎంపికయ్యే అవకాశం

అలల సవ్వడితో ఎగసిపడే నీలి సంద్రం ఓవైపు.. తూర్పుకనుమల్లో విచ్చుకున్న పచ్చందాల ప్రకృతి మరోవైపు.. మధ్యలో సూరీడే కిందికి దిగి.. ఎర్రరంగు పులిమినట్లు అరుదైన వారసత్వ సంపద చూపరులను కట్టిపడేస్తుంటుంది. సహజ సిద్ధమైన ప్రకృతికి ప్రతిరూపంగా.. విశాఖకు వచ్చే సందర్శకులకు వరంగా.. భీమిలిలో అందాలను ఎరుపెక్కించిన ఎర్రమట్టి దిబ్బలు నిజంగా అరుదైన సంపదే. ఆసియాలో కేవలం మూడంటే మూడు ప్రాంతాల్లోనే ఈ అద్భుతం కనువిందు చేస్తోంది. తొలుత ఇసుకకొండలుగా ఏర్పడి.. తర్వాత ఎర్రమట్టి దిబ్బలుగా రూపాంతరం చెందిన ఈ ప్రకృతి వరప్రసాదానికి సరిగ్గా పదకొండేళ్ల క్రితం జాతీయ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు వస్తే.. ఇప్పుడు మరో అరుదైన గుర్తింపు కోసం పోటీ పడుతోంది. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్–2025 జాబితాలో చోటు దక్కించుకునే దిశగా తొలి అడుగు వేసింది. సహజ వారసత్వ స్థలం తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలను చేర్చినట్లు యునెస్కో ప్రకటించింది. – సాక్షి, విశాఖపట్నం


యునెస్కో గుర్తింపు వస్తే...

యునెస్కో గ్లోబల్ పార్కు జాబితాలో ఎర్రమట్టి దిబ్బలు చేరితే సంరక్షణ చాలా సులువు అవుతుంది. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ప్రత్యేక బాడీ ద్వారా ప్రకృతి సిద్ధ సందర్శన ప్రాంతంగా మరింత ఖ్యాతి పొందేందుకు వీలవుతుంది. ప్రస్తుతం సాలార్ జంగ్ మ్యూజియం సంరక్షణ అదే విధంగా సాగుతోంది. ప్రస్తుతం ప్రపంచంలోని 33 దేశాల్లో 120 యునెస్కో గ్లోబల్ పార్కులున్నాయి. ప్రపంచంలోని 196 దేశాల్లో వారసత్వ స్థలాలు గుర్తించేందుకు యునెస్కో సిద్ధమైంది. ఇందులో భాగంగా భారత్ నుంచి 69 ప్రాంతాలు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్ జాబితాలో చోటు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నాయి. ఈ జాబితాలో 5వ స్థానంలో ఎర్రమట్టి దిబ్బలు ఉన్నాయి. టెక్టానిక్ సిస్టమ్, కోస్టల్ సిస్టమ్ థీమ్‌లో ఎంపికయ్యే అవకాశం ఉందని యునెస్కో ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

2014లో జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు

విశాఖపట్నం నుంచి భీమునిపట్నం వెళ్లే మార్గంలోని మట్టి దిబ్బలు 10 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించాయి. ఇవి ఒకప్పుడు 40 మీటర్లదాకా ఎత్తు ఉండేవి. జాతీయ భూవిజ్ఞాన సర్వే సంస్థ ఈ దిబ్బల ప్రదేశ రక్షణ, నిర్వహణ కోసం 2014లో జాతీయ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది. మొత్తం 1,195 ఎకరాల్లో 262.92 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఎర్రమట్టి దిబ్బలు ఉన్న ప్రాంతాన్ని జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు.

ఇసుకే అయినా.. మట్టిదిబ్బలని...



పూర్వ కాలంలో వీటిని ఎర్ర ఇసుక కొండలుగానూ పిలిచేవారు. పాయలుగా ఏర్పడిన తర్వాత.. ఎర్రమట్టి దిబ్బలుగా పిలుస్తున్నారు. వాస్తవానికి భౌగోళిక పరంగా ఇది ఇసుక నుంచి రాయి ఏర్పడుతుంది. పొరలు పొరలుగా ఒక చోట చేరిన ఇసుక రేణువులే వేల సంవత్సరాల తర్వాత రాయిగా మారుతాయి. అలా ఒకచోట పేరుకుపోయిన ఇసుక క్రమంగా గట్టిపడటం మొదలవుతుంది. అది పూర్తి రాయిగా మారే క్రమంలో కాస్త మట్టిలా అనిపించే విధంగా మారుతుంది. ఇది ఇసుకే అయినా మట్టిలా గట్టిగా అనిపిస్తుంది. అదేవిధంగా ఇక్కడ దిబ్బల్లోని ఇసుక, మట్టి ఎరుపు రంగులో ఉండటం వల్ల వీటిని ఎర్రమట్టి దిబ్బలుగా పిలవడం అలవాటైపోయింది.

ఎలా.. ఎప్పుడు ఏర్పడ్డాయంటే..?

ఈ ఎర్రమట్టి దిబ్బలు సుమారు 18,500 నుంచి 20,000 సంవత్సరాల మధ్య కాలంలో ఏర్పడినట్లు భౌగోళిక చరిత్ర చెబుతోంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం బంగాళాఖాతం ప్రస్తుత తీర రేఖ నుంచి కనీసం 5 నుంచి 10 కి.మీ వెనక్కి ఉండేది. తూర్పు కనుమల్లో ఖొండలైట్ శిలలు విస్తరించి ఉన్నాయి. ఈ శిలల్లో గార్నేట్, క్వార్ట్జ్, సిల్లిమనైట్, ఫెల్డ్‌స్పార్, ఇనుప ఖనిజాలు విస్తారంగా ఉంటాయి. భారీ వర్షాలు పడే సమయంలో ఈ కొండల నుంచి నీటి ప్రవాహాల ద్వారా కొట్టుకొచ్చిన మట్టి పదార్థాలు బంగాళాఖాతంలో కలుస్తాయి. ఇలా వరద నీటితో పాటు తూర్పుకనుమల్లో ఉన్న ఖనిజాలు కొట్టుకొచ్చి సముద్ర తీరంలోకి ఇసుకతో కలిసిపోయి మిశ్రమంగా ఏర్పడి పేరుకున్నాయి. కొండల్లోని మట్టి, సముద్రపు ఇసుక, ఖొండలైట్ శిలల్లోని ఖనిజాలన్నీ కలిసి కాస్తా గట్టిదనాన్ని సంతరించుకోవడం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఖనిజాల సమ్మేళనాలు ఆక్సీకరణం చెందడం వల్ల ఈ కొండలు ఎర్రగా మారిపోయాయి. ఏర్పడిన సమయంలో వీటిని ఎర్ర ఇసుక కొండలుగా పిలిచేవారు. కాలక్రమేణా ఈ గుట్టల్లో పేరుకుపోయిన మిశ్రమ అవక్షేపాల్లో వదులుగా ఉండేచోట నీటి ప్రవాహాల తాకిడితో కొట్టుకొని పోవడం వల్ల ఆ ప్రాంతం చిన్న చిన్న లోయలుగా రూపాంతరం చెందింది. క్రమంగా భారీ వర్షాల సమయంలో దాదాపు 3వేల సంవత్సరాల క్రితం వరకూ ఈ ఎర్రమట్టి దిబ్బలు నిరంతరం మార్పులు సంభవిస్తున్నాయి.

తొలుత 'బ్యాడ్ ల్యాండ్' అని పిలిచేవారంట!

ఈ ఆసక్తికరమైన దిబ్బల్ని 1,886లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సూపరింటెండెంట్ విలియం కింగ్ రికార్డుల్లో నమోదు చేశారు. వీటిని అప్పట్లో బ్యాడ్ ల్యాండ్స్ అని పిలిచేవారు. ఎర్రగా ఎందుకు కనిపిస్తున్నాయనే దానిపై పరిశోధనలు చేసిన తర్వాత.. అందులో ఉన్న ఖనిజాల వివరాలు, ఇవి ఎలా ఏర్పడ్డాయని తెలుసుకొని అప్పుడు ఎర్రమట్టి దిబ్బలుగా నామకరణం చేశారని చరిత్ర చెబుతోంది. ఇవి క్వాటర్నరీ యుగానికి ఆనవాళ్లుగా నిర్ధారించారు. అప్పట్లో ఈ దిబ్బల్లో మానవ జీవన గమన విశేషాలు కూడా లభ్యమయ్యాయని చరిత్ర చెబుతోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బఫర్ జోన్ ఏర్పాటు

వారసత్వ ప్రదేశంగా జీఎస్ఐ గుర్తించిన తర్వాత 2016లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రక్షిత ప్రదేశాల విభాగంలో ఎర్రమట్టి దిబ్బల్ని చేర్చింది. తర్వాత దీనిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో చాలా మేరకు దిబ్బలు ఆక్రమణలకు గురయ్యాయి. తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దాదాపు 148 అడుగుల మేర బఫర్ జోన్‌గా గుర్తించి ఆ ప్రాంతాన్ని సంరక్షించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎర్రమట్టి అక్రమ రవాణా చేస్తూ.. దిబ్బలపై విధ్వంస రచన చేస్తున్నారు. వీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా.. పట్టించుకోవడం లేదు. యునెస్కో గుర్తింపు వస్తే ఎర్రమట్టి దిబ్బల సంరక్షణకు ఇక ఎదురుండదని పర్యావరణవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కురిసిందీ.. వానా





టౌన్ కొత్త రోడ్డులో వర్షం



దుర్గాలమ్మ గుడిరోడ్డులో అన్నదానానికి గొడుగులతో క్యూలో నిలబడిన భక్తులు

ప్రాంతం	కురిసిన వర్షం (మి.మీలో)
మహారాణిపేట	51.2
సీతమ్మధార	48.8
ఆరిలోవ	30.8
పెదగంట్యాడ	12.2
ములగాడ	10.2
గోపాలపట్నం	4.2
గాజువాక	4.0
ఆనందపురం	2.0
పెందుర్తి	1.0



సాక్షి, విశాఖపట్నం : వరుణుడు కరుణించాడు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మీదుగా కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం.. విశాఖ నగరంపై పడింది. పలు చోట్ల భారీ వర్షం.. మరికొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. కాలేజీలు, స్కూల్స్, కార్యాలయాలకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో విద్యార్థులు, ఉద్యోగులు కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల రహదారులపై నీరు నిలవడంతో.. ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒకప్పుడు ఎంత వర్షం కురిసినా 15 నిమిషాల్లో నగరంలో వరదనీరు కనిపించేది కాదు. కూటమి ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ గాలికొదిలెయ్యడంతో.. మురుగు కాలువలు, గెడ్డలు పూడికతో నిండిపోయి.. వరదనీరు పారేందుకు ఇబ్బందికర వాతావరణం ఏర్పడటంతో.. రోడ్లపైనే నీరు నిలిచిపోతోంది. దీంతో.. నగర వాసులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం వరకూ వర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నేడు మెగా లోక్ అదాలత్

ఉమ్మడి విశాఖ జిల్లాలో 36 బెంచీల ఏర్పాటు

విశాఖ లీగల్: ఉమ్మడి విశాఖ జిల్లాలో శనివారం నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని అన్ని న్యాయస్థానాల్లో ఈ మెగా లోక్ అదాలత్ జరగనుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం కోసం దాదాపు 6,000 కేసులు గుర్తించామని, వీటిని పరిష్కరించడానికి 36 బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. నేర శిక్షాస్మృతి పరిధిలోని రాజీ అయ్యే కేసులు, పౌర శిక్షాస్మృతిలోని కేసులు, బ్యాంకులు, బీమా కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన సివిల్ వివాదాలు, కుటుంబ న్యాయస్థానం పరిధిలోని కేసులను పరిష్కరిస్తామని వెల్లడించారు. తమ కేసులను రాజీ చేసుకోవాలనుకునే వారు న్యాయ సేవ ప్రాధికార సంస్థలను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జే.పీ.నడ్డా శనివారం విశాఖ వస్తున్నారు. బిహార్ నుంచి విమానంలో శనివారం రాత్రి 8.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా నోవోటెల్ హోటల్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు. 14న విశాఖ రైల్వే స్టేడియం గ్రౌండ్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం విమానంలో ఢిల్లీ వెళ్తారు.

సమన్వయంతో పనిచేయండి

కేజీహెచ్ వైద్యులు, అధికారులకు కలెక్టర్ ఆదేశం



కేజీహెచ్ విభాగాధిపతులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: కేజీహెచ్‌లోని వైద్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి రోగులకు నాణ్యమైన సేవలందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కేజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆసుపత్రిలోని మౌలిక వసతులు, వివిధ అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. ఆయా విభాగాల్లో ఉన్న సమస్యలను, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కల్పించాల్సిన వసతులు, కొనుగోలు చేయాల్సిన పరికరాల గురించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు సేవలందించడంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అన్ని విభాగాల పనితీరు మెరుగుపడాలన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై కూడా సమీక్షించిన కలెక్టర్.. అధికారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ రాధాకృష్ణన్, డాక్టర్ వాసవి లత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ ఎ.అచ్చెంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి 'స్వస్థ నారీ' కార్యక్రమం: జిల్లాలో మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా స్థాయి కో–ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం విజయవంతం కోసం అధికారులకు ఆయన సూచనలు చేశారు. మహిళలు, పిల్లలకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, సేవలు, మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావును ఆదేశించారు. రక్తదాన శిబిరాలను కూడా నిర్వహించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, పీహెచ్‌సీలు, జిల్లా వైద్య కళాశాలల ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణుల సహాయంతో మహిళలు, పిల్లల ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో రమేష్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



భక్తి పారవశ్యం.. కళా నైపుణ్యం



దుర్గాదేవి విగ్రహాల తయారీలో బిజీగా కళాకారులు

నగరంలో దుర్గాదేవి మహోత్సవాల సందడి అప్పుడే మొదలైంది. రాబోయే దేవీ నవరాత్రుల కోసం నగరంలోని పలు ప్రాంతాలలో దుర్గామాత విగ్రహాల తయారీ శరవేగంగా సాగుతోంది. ముఖ్యంగా లాసన్స్ బే కాలనీ, కంచరపాలెం వంటి ప్రాంతాల్లోని కార్మికులు, కళాకారులు విగ్రహాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. ఈ నెల 22వ తేదీన ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాల కోసం చిన్న విగ్రహాల నుంచి భారీ ప్రతిమల వరకు ఇక్కడ తయారవుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో పాటు, స్థానిక నిపుణులు విగ్రహాల తయారీలో పాలు పంచుకుంటున్నారు. ఒండ్రుమట్టి, గడ్డి, వెదురు వంటి సహజ సిద్ధమైన పదార్థాలతో అమ్మవారి విగ్రహాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో దర్శనమిచ్చే దుర్గా మాతను ప్రతిష్ఠించేందుకు నగరంలోని పలు పూజా కమిటీలు, యువజన సంఘాలు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చేశాయి. ఈ విగ్రహాల తయారీ కేంద్రాలు పండగకు ముందే నగరంలో ఆధ్యాత్మిక, పండగ శోభను తీసుకొచ్చాయి.





– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సికింద్రాబాద్ వరకు చర్లపల్లి-నహర్లాగున్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం చర్లపల్లి-నహర్లాగున్-చర్లపల్లి మధ్య నడుస్తున్న స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ వరకు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 13న సికింద్రాబాద్/చర్లపల్లి-నహర్లాగున్(07046) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్‌లో స్టేషన్‌లో బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 16న నహర్లాగున్‌లో బయలుదేరే నహర్లాగున్-చర్లపల్లి/సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (07047) రాత్రి 9.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

లిక్విడ్ గంజాయితో ముగ్గురు పట్టివేత



లిక్విడ్ గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పెందుర్తి పోలీసులు

పెందుర్తి: ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి లిక్విడ్ గంజాయి(హాష్ ఆయిల్)ను నగరానికి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పెందుర్తి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సరిపల్లి చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి రెండు లీటర్ల హాష్ ఆయిల్, మూడు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. అల్లూరిసీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం డొన్నలవలస గ్రామానికి చెందిన సమారిడి అర్జున్, పైనంపాడుకు చెందిన దుంబరి స్వామి, డుంబ్రిగుడ మండలం పోతంగికి చెందిన దుంబరి జోయో మూడు బైక్‌లపై విశాఖ నగరానికి హాష్ ఆయిల్ తరలిస్తున్నారు. సరిపల్లి చెక్‌పోస్టు వద్ద పెందుర్తి పోలీసులు జరిపిన తనిఖీల్లో నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఎస్ఐ దేముడునాయుడు బృందం వారిని చాకచక్యంగా పట్టుకుని లిక్విడ్ గంజాయితో పాటు బైక్‌లు, నగదు, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మల్కాపురం: సేవా మార్గంలో ఒక కారు డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. శుక్రవారం ఉదయం నగరానికి చెందిన రాజు, వెంకట శ్రీదేవి, మహాలక్ష్మి, శ్వేత లక్ష్మి, వెంకటలక్ష్మి కారులో అచ్యుతాపురం వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ వైపు వస్తున్నారు. మారుతి సర్కిల్ వద్ద వంతెన పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం రోడ్డుపై ఉంచిన సిమెంట్ దిమ్మలను గమనించకుండా కారు నడుపుతున్న వ్యక్తి వాటిని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వస్తున్న 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్.. గాయపడిన వారిని గుర్తించి ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, మానవత్వం చాటుకున్నారు.

కళాభారతిలో నృత్య వైభవం

ఘనంగా వైశాఖి జాతీయ నృత్యోత్సవం ప్రారంభం



కేరళ కూచిపూడి కళాకారిణి అనుపమ మోహన్‌కు వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: కళాభారతి వేదికపై 17వ వైశాఖి జాతీయ నృత్యోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవానికి కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఐసీసీఆర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. ముందుగా విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి సుదగాని రవిశంకర్ నారాయణ్, జీఎస్టీ అడిషనల్ డైరెక్టర్ ఎస్. మహమ్మద్ అలీ, కళాభారతి కార్యదర్శి జి.వి.ఆర్.కె. ప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

తొలిరోజు ప్రదర్శనల్లో భాగంగా కేరళకు చెందిన కూచిపూడి కళాకారిణి డా.పద్మిని క్రిష్ణన్ మరకత మణిమయ చేల అనే ఉత్తుకాడు వెంకట కవి కృతితో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. న్యూఢిల్లీకి చెందిన ఒడిస్సీ నృత్యకారిణి విద్యూషి కవిత ద్వివేది బృందం పంచాక్షర స్తోత్రం, ఓం నమఃశివాయ, శుద్ధ నృత్యం, గీతగోవిందంలోని అష్టపది, విష్ణు అవతారాలు వంటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. తెలంగాణకు చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత ఒగ్గు రవికుమార్ బృందం ప్రదర్శించిన ఒగ్గు డోలు విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మల్లన్న, బీరప్ప కథలతో కూడిన వారి ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.

పురస్కారాల ప్రదానం

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన కళాకారులను ప్రతిష్టాత్మక పురస్కారాలతో సత్కరించారు. అనుపమ మోహన్ (కూచిపూడి, కేరళ)కు పద్మభూషణ్ గురు డా. సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు, డా. కె.ఆముక్తమాల్యదకు పద్మభూషణ్ గురు డా. సరోజా వైద్యనాథన్ యువ పురస్కార్ 2025, డా. పద్మిని క్రిష్ణన్ (కూచిపూడి, కేరళ)కు వైశాఖీ ఎక్సలెన్స్ అవార్డు 2025, కవిత ద్వివేది(ఒడిస్సీ, న్యూఢిల్లీ)కి నాట్యశ్రీ అవార్డు 2025, ఒగ్గు రవికుమార్ (ఒగ్గు డోలు, తెలంగాణ)కు పద్మభూషణ్ గురు డా. సరోజా వైద్యనాథన్ యువ పురస్కార్ 2025లను ప్రదానం చేశారు. భారతీయ నృత్య సంప్రదాయాలను పరిరక్షిస్తూ, యువ కళాకారులను ప్రోత్సహించడానికి వైశాఖీ నృత్యోత్సవం ఒక గొప్ప వేదికగా నిలుస్తోందని వక్తలు ప్రశంసించారు. నిర్వాహకులు బత్తిన విక్రమ్ గౌడ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అరుణాచలంలో కాశీపాలెంవాసి హత్య!

- వెంకటాపురం మాజీ సర్పంచ్ కుటుంబం ఘాతుకం
- తమ కుమార్తెను ప్రేమించాడని దారుణం



డెక్క నవీన్ మృతదేహం, నవీన్ (ఫైల్)

అచ్యుతాపురం : పొరుగు రాష్ట్రంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారంలో దేవరాపల్లి మండలం కాశీపాలెం గ్రామానికి చెందిన డెక్క నవీన్ యువకుడు హత్యకు గురైనట్లు సమాచారం. పోలీసులు ధ్రువీకరించనప్పటికీ ఈ దుర్ఘటన జరిగినట్టు శుక్రవారం రాత్రి విస్తృతంగా ప్రచారమైంది. నవీన్ రాంబిల్లి మండలం చిన్నపూడి గ్రామంలో అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ కుమార్తెతో పదో తరగతి, ఇంటర్ నుంచి అతడికి స్నేహం ఏర్పడింది. వీరి సాన్నిహిత్యం గురించి తెలిసి యువతిని చెన్నైలో చదివిస్తున్నారని, అయినా వీరి మధ్య పరిచయం కొనసాగిందని, అదే అమ్మాయి తరపు వారికి కంటగింపుగా మారిందని సమాచారం. నవీన్ వేరే కులానికి చెందినవాడు కావడం, పెద్దగా చదువుకోకపోవడం, ఆస్తి లేకపోవడంతో అమ్మాయి తల్లికి ఇష్టం లేదు. మూడు రోజుల క్రితమే అమ్మాయిని తీసుకొని తల్లి అరుణాచలం వెళ్లింది. నవీన్‌కి ఫోన్ చేసి వారు ఉన్న చోటుకు రప్పించారు. అక్కడ ఒక లాడ్జిలో రూమ్ తీసుకొని ఉన్నారు. నవీన్ ఫోన్‌లో అసభ్యకరమైన ఫొటోలు ఉన్నట్లు గమనించి లాక్కొని చితకొట్టేశారు. అనంతరం తమతో వచ్చిన ఇద్దరు వ్యక్తులతో నవీన్‌ను హత్య చేసినట్లు సమాచారం. అమ్మాయిని, ఆమె తల్లిని అరుణాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని.. ప్రస్తుతం ఇద్దరూ అక్కడ జైల్లో ఉన్నట్లు భోగట్టా.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని ఉద్యోగ సంఘాల నాయకులు డిస్కమ్‌లకు హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థలో ఆందోళన కార్యక్రమాల నోటీసును ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడికి జేఏసీ నాయకులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు భూక్యా నాగేశ్వరరావు, పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 మధ్యలో డిస్కమ్‌లో చేరిన ఉద్యోగులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. మృతి చెందిన ఉద్యోగుల కుటుంబానికి కారుణ్య నియామకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి నేరుగా వేతనాలు అమలు చేయాలని, డిస్కమ్‌ల పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. దీంతోపాటు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని కోరుతూ సీఎండీకి నోటీసులు అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిస్కం జేఏసీ నాయకులు తురగా రామకృష్ణ, జోగి నాయుడు, కేతా భాస్కర్, ఎస్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు

డీఐజీ గోపీనాథ్ జెట్టి



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశాఖ సిటీ: గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీలను ఆదేశించారు. శుక్రవారం రేంజ్ పరిధిలోని అల్లూరి, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో డీఐజీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గంజాయి నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, వివిధ నేరాల నిరోధక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. అక్రమ గంజాయి రవాణా వ్యాపారంలో పాల్గొన్న 14 మంది నేరస్తుల ఆస్తులు రూ.10,04,89,621 స్వాధీనం చేసుకోవడాన్ని అభినందించారు. ఇప్పటి వరకు 1,119 మంది గంజాయి నేరస్తుల కదలికలపై షీట్లు తెరిచినట్లు చెప్పారు. అలాగే 51 మంది నిందితులపై పీడీ చట్టం, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. తరచూ గంజాయి రవాణా చేసే 368 మంది, అలాగే గంజాయితో పాటు ఇతర నేరాలలో పాల్గొన్న 370 మందిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిలబుల్ వారెంట్లు ఆధారంగా 341 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. వీరిలో 24 మందికి 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. విశాఖపట్నం రేంజ్ పోలీసులు స్టే సేఫ్, నిదాన్, కాజ్, నాట్ గ్రిడ్ యాప్స్ ద్వారా పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంలో కృషిని అభినందించారు. మహిళలు, పిల్లలపై లైంగిక నేరాలు, మహిళ మిస్సింగ్ కేసులపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని చెప్పారు. రేంజ్ పరిధిలోని శాంతి భద్రతల సమస్యలపై చర్చించారు.

దివ్యాంగురాలిపై లైంగిక దాడి

- దోషికి 20 ఏళ్ల జైలు
- బాలికకు రూ. 4 లక్షల పరిహారం

విశాఖ లీగల్: దివ్యాంగురాలైన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా చెల్లించాలని, ఆ జరిమానాలో రూ. 8 వేలు బాలికకు ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. అంతేకాకుండా బాధితురాలికి ప్రభుత్వం రూ.4 లక్షల పరిహారం చెల్లించాలని కూడా తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలివి. నిందితుడు బోర ఎల్లారెడ్డి (50) భీమిలి మండలం, జేవీ అగ్రహారం గ్రామానికి చెందినవాడు. బాధిత బాలిక కూడా అదే గ్రామానికి చెందినది. బాలిక దివ్యాంగురాలు, మతిస్థిమితం లేదు. మంచం మీద నుంచి కదల్లేని పరిస్థితి. బాలికను ఆమె నాయనమ్మ చూసుకుంటూ ఉండేది. 2025 జనవరి 21న ఉదయం బాలికను మంచంపై ఉంచి ఆమె నాయనమ్మ పని మీద బయటకు వెళ్లింది. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో నిందితుడు ఎల్లారెడ్డి బాలికపై అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, అలాగే ఇంటి సమీపంలో మహిళలు ఎల్లారెడ్డి ఇంటికి వెళ్లి నిలదీయగా.. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నిందితుడు వారిపై దురుసుగా ప్రవర్తించాడు. వెంటనే బాలిక తల్లి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నార్త్ ఏసీపీ ఎస్. అప్పలరాజు కేసు నమోదు చేసి, నిందితుడిపై భారతీయ నేర సంహిత సెక్షన్ 258(2) కింద నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

వ్యక్తిని గాయపరిచిన యువకునికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్ : స్వల్ప వివాదంలో ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన యువకునికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ గాజువాకలోని 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు శుక్రవారం తీర్పు ఇచ్చారు. జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించాలని, లేకుంటే అదనంగా 6 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీనివాస్ చంద్రశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పొట్నూరి మనోజ్‌కుమార్ (32) శ్రీహరిపురం జవహర్‌నగర్‌లోని విజయ టవర్స్‌లో ఉంటున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో భద్రత అధికారిగా పనిచేస్తున్నారు. ధనాల మోహన్ గాజువాక మెయిన్ రోడ్‌లోని డ్రైవర్స్ కాలనీ ఆంజనేయస్వామి గుడి దగ్గర ఉంటున్నాడు. అతడు 2019 జూలై 30వ తేదీన తన మిత్రులతో కలిసి గాజువాక సెంటర్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు రాత్రి 10 గంటల సమయంలో వచ్చారు. పూటుగా మద్యం సేవించిన మోహన్ బార్ బయట ఉన్న మనోజ్‌తో ఘర్షణ పడ్డాడు. మోహన్ తన దగ్గర ఉన్న బటన్ కత్తితో మనోజ్ పొత్తికడుపులో పొడిచాడు. తీవ్ర గాయాలతో మనోజ్ కుమార్‌ని సమీపంలోని ఆర్కే ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. అప్పటి గాజువాక ఎస్ఐ బి.భాస్కర శంకర్ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ 8 మంది సాక్షులను విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

రోబోటిక్ సర్జరీతో క్లిష్టమైన కణితుల తొలగింపు



ప్యాంక్రియాటిక్ రోబో సర్జరీ గురించి వివరిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యుడు విశ్వబసు దాస్

ఆరిలోవ: డావిన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టమ్‌తో సంక్లిష్టమైన ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కేర్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో శుక్రవారం సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ అండ్ రోబోటిక్ సర్జరీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ విశ్వబసు దాస్ తన వైద్య బృందంతో కలిసి ఈ వివరాలను వెల్లడించారు. జి.శేషగిరిరావు, కె.శుభమణి అనే ఇద్దరు రోగులు పెరియాంపుల్లరీ కణితులతో బాధపడుతున్నారని చెప్పారు. ఈ కణితుల కారణంగా వారికి కామెర్లు, కడుపునొప్పి, బరువు తగ్గడం వంటి సమస్యలు ఎదురైనట్లు వివరించారు. వారికి కేర్ ఆస్పత్రిలో డావిన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టమ్ సహాయంతో అత్యాధునిక పద్ధతిలో శస్త్రచికిత్స చేసి, కణితులను విజయవంతంగా తొలగించినట్లు పేర్కొన్నారు. ఈ తరహా శస్త్రచికిత్స రాష్ట్రంలో ఇదే మొదటిసారన్నారు. సాధారణంగా ఈ సమస్యకు ఓపెన్ సర్జరీ అవసరమైనప్పటికీ, రోబోటిక్ విధానంలో చిన్న రంధ్రం ద్వారానే శస్త్రచికిత్స చేయవచ్చని వివరించారు. ఈ విధానం ద్వారా శస్త్రచికిత్స తక్కువ సమయంలో పూర్తైందని, అధిక రక్తస్రావం కూడా జరగలేదన్నారు.

బైక్ ఇవ్వలేదని తండ్రితో గొడవ

రైలు కింద పడి యువకుడి బలవన్మరణం



తేజ(ఫైల్)

గోపాలపట్నం: బైక్ ఇవ్వలేదని తండ్రితో గొడవ పడి రైలు కింద తలపెట్టి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రానగర్ వద్ద శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 89వ వార్డు చంద్రానగర్‌కు చెందిన కరణం తేజ(21) వడ్రంగి పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. తేజకు మద్యం సేవించే అలవాటు ఉంది. జులాయిగా తిరుగుతుంటాడు. అతనికి ఒక తమ్ముడు ఉన్నాడు. శుక్రవారం ఉదయం తండ్రి కృష్ణకు బైక్ కావాలని అడిగాడు. అందుకు ఆయన వద్దన్నాడు. అతని తమ్ముడు ఆ బైక్‌ను తీసుకుని పనికి వెళ్లాడు. తేజ తమ్ముడి వద్ద నుంచి బైక్ తీసుకుని బయటకు వెళ్లగా.. ఆ విషయం తండ్రికి తెలిసింది. దీంతో ఆయన తేజ వద్ద నుంచి బైక్ తీసుకున్నాడు. ఈ విషయంలో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. తనకు బైక్ ఇవ్వలేదని తీవ్ర మనస్తాపంతో తేజ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

15న గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు

మహారాణిపేట: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈనెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు జిల్లాలో 58 వేల పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నారు. దానికి సంబంధించిన గోడ పత్రికను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎన్.కరుణాకర రావు, ఉప సంచాలకులు డాక్టర్ డి.శంకరరావు, అభివృద్ధి పథకం అధికారి డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అప్పన్న రికార్డులు, ఆభరణాల పరిశీలన

- నేటితో వెరిఫికేషన్ ముగిసే అవకాశం
- ఆర్‌జేసీకి నివేదిక అందించనున్న కమిటీ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంతోపాటు, స్వామివారి ఉపాలయాలకు భక్తులు సమర్పించిన బంగారం, వెండి వస్తువుల తనిఖీ, రికార్డుల పరిశీలన కొనసాగుతోందని దేవస్థానం డిప్యూటీ ఈవో, బంగారం, వెండి కస్టోడియన్ సింగం రాధ తెలిపారు. శనివారంతో తనిఖీలు ముగిసే అవకాశం ఉందని, నివేదికను దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేసీకి త్వరలో కమిటీ సమర్పించనుందన్నారు. కొన్ని రోజులుగా జరుగుతున్న బంగారం, వెండి ఆభరణాల తనిఖీ, రికార్డుల పరిశీలన వివరాలను శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. స్వామివారి బంగారం, వెండి ఆభరణాలకు సంబంధించిన రికార్డులు, తూకాల్లో అవకతవకలు జరిగాయంటూ ప్రభాకరాచారి అనే వ్యక్తి గత ఏడాది చేసిన ఫిర్యాదు మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 17 నుంచి 21, 25 నుంచి 27, ఫిబ్రవరి 11 నుంచి 13, 18 నుంచి 24 వరకు జ్యుయలరీ వెరిఫికేషన్ అధికారి తనిఖీలు నిర్వహించి ప్రాథమిక నివేదికను ఆర్జేసీకి అందించారన్నారు. తుది నివేదిక కోసం 5గురు సభ్యులతో మళ్లీ కమిటీ ఏర్పాటు చేయడంతో ఆ కమిటీ ఆగస్టు 9 నుంచి 20 నుంచి వరకు తనిఖీలు చేసిందన్నారు. మళ్లీ రెండు రోజుల నుంచి బ్యాంకుల్లోను, అర్చకుల ఆధీనంలో ఉన్న వస్తువులను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తుది నివేదికను రెండు రోజుల్లో ఆర్‌జేసీకి సమర్పించే అవకాశం ఉందన్నారు. కమిటీ నిర్ధారించిన ఆభరణాల వివరాలను త్వరలో పత్రికాముఖంగా వెల్లడిస్తామన్నారు.

18న ప్రభుత్వ డ్రైవర్ల హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

మహారాణిపేట: జిల్లా సహకార శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 18న ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ డ్రైవర్ల మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఆ రోజు 11 గంటలకు డైమండ్ పార్క్ సమీపంలోని డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం అనంతరం సొసైటీ ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు జామి సత్యనారాయణ, కార్యదర్శి కె.త్రినాథరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సొసైటీలో ఉన్న 187 మంది సభ్యులు సమావేశానికి హాజరై, ఎన్నికల్లో పాల్గొనాలని వారు కోరారు.